# సంపాదకీయము

శ్రీకృష్ణ భగవానుని జన్మదిన వేడుక, శ్రీ కృష్ణజయంతి ఈ రోజు మనం జరుపుకొనుచున్నాము. శ్రీ కృష్ణ భగవానుని బోధనలు, మన పూజ్య గురుదేవులైన శ్రీ రామచంద్రజీ మహారాజ్ వారి బోధనలు పోలియుండుట మనకు గ్రాహ్యమైన విషయమే. భగవాన్ శ్రీ కృష్ణుడు మన సంస్థకు అధిపతియని ఈ సందర్భములో మీ దృష్టికి తీసుకొని వచ్చుచున్నాను. అవతారపురుషులు అవతరించుటకు, విశిష్టమూర్తిమత్వము (Special Personality) వచ్చుటకు చాలా వ్యత్యాసము కలదు. ప్రస్తుతము శ్రీ కృష్ణభగవానుడు పూజ్య బాబూజీ మహారాజ్ గారిలో తనను తాను వ్యక్తపరచుకొనుచున్నారు. వారి సర్వశక్తులు పూజ్య బాబూజీ మహారాజ్ గారికి సంక్రమించుటయే గాక యింకనూ మరిన్ని ఉన్నతమైన శక్తులు వీరికి సంక్రమించినవని Towards Infinity పుస్తము చదివినవారికి తెలియును. ఆ శక్తులను గురించి మనము తెలుసుకొనవలసిన అవసరము ఎంతమాత్రము లేదు. మనము ఎల్లవేళలా మన గురుదేవులైన పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (బాబూజీ మహారాజ్) వారికి వొదిగియుండవలెను. మన సంస్థలోని ప్రాణాహుతి ప్రక్రియ కూడా శ్రీ కృష్ణభగవానుని కాలములో కలదు. ఆ తరువాత కాలములో ప్రేమ, భక్తి సిద్ధాంతములు ప్రాముఖ్యత వహించి ప్రాణాహుతి ప్రక్రియ కనుమరుగై పోయినదని పూజ్య బాబూజీ మహారాజ్ గారు చెప్పినారు. మనము సదా, సర్వదా మన పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ మహారాజ్ గారి స్మరణలో నుండుటకే యిక్కడ వున్నామను సంగతి ఎప్పుడూ మరువరాదు. లిప్తకాలమైన శ్రీ కృష్ణభగవానుని గురించి తలవరాదు. మనకు అన్నీ మన గురుదేవులు పూజ్య బాబూజీ మహారాజ్ వారే.

శ్రీ కృష్ణ భగవానుడు గీతలోని ఒక శ్లోకములో
"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

అన్నారు. అంటే సజ్జనులను సంరక్షించుటకు, దుర్మార్గులను నశింపజేయుటకు, ధర్మమును తిరిగి స్థాపించుటకు ప్రతి యుగమునందును నేను అవతరించుచుందునని దీని అర్థము.

కాని యుగాంతమునకు ముందే ప్రస్తుత పరిస్థితులలో మానవుడు తన అలోచనాశక్తిని వక్రమార్గములో వినియోగించుటవలన ప్రకృతి కలుషితమై తన సమతుల్యతను కోల్పోయినది. మానవచైతన్యము సత్‌తత్వముయొక్క విలువను పూర్తిగా విస్మరించి స్థూలత్వమువైపు

పరుగులు తీయుచూ స్వార్థము, ద్వేషము, ప్రతీకారము మొదలైన దుష్టప్రవృత్తులు పెచ్చుపెరిగిపోయి ఈ సృష్టికే విఘాతము కలుగజేయుచున్న తరుణములో దానిని సరిదిద్ది సరియైన మార్గములో పెట్టవలసిన ఆవశ్యకత అనివార్యమైనది. అటువంటి తరుణములో ప్రకృతి తన సర్వశక్తులను పూజ్యులైన శ్రీ బాబూజీ మహారాజ్ వారికి వొసగినది. మనము శ్రీ రామచంద్రచైతన్యముగా చెప్పుకొను పరిశుద్ధచైతన్యము, తమ అలోచనాసరళిని పరిశుద్ధపరచుకొని ఆ పరిశుద్ధచైతన్యములో మిళితమగుటకు యిచ్చగించు సాధకులకు అన్నివేళలందు సహాయపడుటకు విశ్వమంతయూ వ్యాపించియున్నది.

ఈ శుభసందర్భములో మన పత్రికపై ముద్రించబడుచున్న భగవద్గీత శ్లోకమును గుర్తుచేసుకొనెదము.

"మచ్చిత్తా మద్గత ప్రాణాః బోధయన్తః పరస్పరం
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తిచ రమన్తిచ"

అనగా నాయందు మనస్సు కలవారును, నన్ను పొందిన ప్రాణములు (అనగా యింద్రియములు) గలవారును, (లేక నాయెడల ప్రాణములర్పించినవారును) యై, నన్ను గూర్చి పరస్పరము బోధించుకొనుచు ఎల్లప్పుడును సంతృప్తిని పొందుచున్నారని పై శ్లోకముయొక్క అర్థము. ఇక్కడ నాయందు అనగా మన గురుదేవులైన పూజ్యబాబూజీ మహారాజ్ గారియందని అర్థము చేసుకొనవలెను. దీని వెనుకగల భావమేమంటే మనందరము గురుదేవుల చైతన్యమును మరల, మరల పంచుకొనుచుండవలెను. దీనివలన వారిపై విశ్వాసము బలపడును. ఎట్టి పరిస్థితులలోను మన గురుదేవులు పూజ్య శ్రీ బాబూజీ మహారాజ్ వారిని విస్మరించి శ్రీ కృష్ణుని తలవరాదు. అట్టిపొరపాటు చేయుటకు ప్రయత్నించవలదు. అటువంటి మహాను భావుని గురువుగా పొందుట మన పూర్వజన్మ సుకృతము. మనకు లభించిన ఈ సదవకాశమును వినియోగించుకొని మన గురుదేవులు బోధించిన విధముగా సాధనను క్రమబద్ధముగా చేయుచూ వారి సహాయమును నిరంతరము ప్రాణాహుతిద్వారా పొందుచూ ప్రకృతి తలపెట్టిన ఈ మహాయజ్ఞములో మనవంతు కృషి మనము చేయవలెను. సద్గురువుల కృపాకటాక్షములు మనకు తప్పక లభించునని మా ప్రగాఢవిశ్వాసము.

- విరామం